జనం కోసం.. అక్షర సమరం

# ఇదీ సంగతి

సంపుటి: 5 - సంచిక: 12 | 8 సెప్టెంబర్ 2026 | మంగళవారం | 4 పేజీలు

## అశోక్‌సాగర్‌లో తల్లీ కుమారుడి మృతదేహాలు

◆ ఎడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఘటన..
◆ దర్యాప్తు చేపట్టిన పోలీసులు



(నిజామాబాద్ క్రైం, ఇదీ సంగతి)

నిజామాబాద్ నగర శివారులోని అశోక్‌సాగర్ చెరువులో తల్లీకుమారుడి మృతదేహాలు లభ్యమవడం కలకలం రేపింది. మృతదేహాలను గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. ఇద్దరూ చెరువులోకి దూకి మృతిచెందారా.. లేక ప్రమాదవశాత్తు నీటిలో పడి ప్రాణాలు కోల్పోయారా అన్నది ప్రస్తుతం మిస్టరీగా మారింది. ఘటనపై యెడపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం తరలించేందుకు చర్యలు చేపట్టారు. మృతుల వివరాలు, ఘటనకు దారితీసిన కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.



## రైస్ మిల్లర్లపై దాడులు ఆపే వరకు ఆందోళనలు చేస్తాం

(నిజామాబాద్, ఇదీ సంగతి)

సీఎంఆర్ పేరుతో రైస్ మిల్లర్లపై పోలీసులు చేపట్టిన దాడులను నిరసిస్తూ నిజామాబాద్ రైస్ మిల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. జిల్లాలోని రెండు రైస్ మిల్స్ అసోసియేషన్లకు చెందిన మిల్లర్లు ధర్నాలో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. మిల్లర్లను లక్ష్యంగా చేసుకుని పోలీసులు దాడులు చేయడం సరికాదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.రైస్ మిల్లర్లపై దాడులు, తనిఖీల పేరుతో వేధింపులు ఆపే వరకు ఆందోళన కొనసాగిస్తామని అసోసియేషన్ ప్రతినిధులు స్పష్టం చేశారు. మిల్లర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, అనవసరంగా మిల్లర్లను ఇబ్బందులకు గురిచేయకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యపై ప్రభుత్వం స్పందించి స్పష్టమైన హామీ ఇచ్చే వరకు నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు.

## కానిస్టేబుల్ ప్రమోద్‌కుమార్‌కు ఘన నివాళి..

(నిజామాబాద్ క్రైం, ఇదీ సంగతి)



విధి నిర్వహణలో మృతి చెందిన పోలీస్ కానిస్టేబుల్ ఎంపల్లి ప్రమోద్‌కుమార్ ప్రథమ వర్ధంతి సందర్భంగా పోలీస్ అధికారులు ఘనంగా నివాళులర్పించారు. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ సాయిచైతన్య పాల్గొని ప్రమోద్‌కుమార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పోలీస్ శాఖకు ప్రమోద్‌కుమార్ అందించిన సేవలను స్మరించుకున్నారు. విధి నిర్వహణలో ఆయన చూపిన అంకితభావం, క్రమశిక్షణను కొనియాడారు. పోలీస్ శాఖ కోసం సేవలందించిన సిబ్బంది సేవలను ఎప్పటికీ గుర్తుంచుకుంటామని పేర్కొన్నారు.అనంతరం ప్రమోద్‌కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.కుటుంబానికి పోలీస్ శాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ ప్రకాష్‌యాదవ్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీధర్‌రెడ్డి, మల్లేశం, టౌన్ సీఐ శ్రీనివాసరాజ్, ఇతర సీఐలు, ఎస్ఐలు, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రపాటి శ్రీను, పోలీస్ అధికారులు, సిబ్బంది, ప్రమోద్‌కుమార్ కుటుంబ సభ్యులు, బంధువులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌తో కేసులకు సత్వర పరిష్కారం

(నిజామాబాద్ క్రైం, ఇదీ సంగతి)



న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన, తక్కువ ఖర్చుతో పరిష్కరించుకునేందుకు ఈ నెల 12న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య కోరారు. చిన్నచిన్న కేసులు, ట్రాఫిక్ చలానాలు, స్వల్ప నేరాలకు సంబంధించిన కేసులు, సివిల్ వివాదాలను పరస్పర అంగీకారంతో పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు.లోక్ అదాలత్ ద్వారా ఇరుపక్షాల అంగీకారంతో వివాదాలకు శాంతియుత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. న్యాయస్థానాల్లో కొనసాగుతున్న కేసులను సుదీర్ఘ ప్రక్రియ లేకుండా త్వరగా ముగించుకునేందుకు ఇది మంచి అవకాశమని సీపీ సూచించారు. పెండింగ్ కేసులు ఉన్న కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

జనం కోసం.. అక్షర సమరం

# ఇదీ సంగతి

సంపుటి: 5 - సంచిక: 12 | 8 సెప్టెంబర్ 2026 | మంగళవారం | 4 పేజీలు



## మహిళా ఎమ్మెల్యేలపై.. దాడిని ఖండిస్తూ ధర్నా

(నిజామాబాద్ ప్రతినిధి, ఇదీ సంగతి)

అసెంబ్లీ ఆవరణలో బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డిలపై జరిగిన దాడిని నిరసిస్తూ నిజామాబాద్‌లో బీఆర్ఎస్ మహిళా నేతలు ధర్నా చేపట్టారు. అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చౌరస్తా ధర్నా చౌక్‌లో మంగళవారం నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అసెంబ్లీ ఆవరణలోనే మహిళా ప్రజాప్రతినిధులపై దాడి జరగడం ప్రజాస్వామ్యానికి మచ్చగా అభివర్ణించారు. ప్రజల తరపున ప్రశ్నించే ప్రతిపక్ష ఎమ్మెల్యేలపై దాడులు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. ఘటనకు బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మహిళా ప్రజాప్రతినిధులకు రక్షణ కల్పించాలని నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. మాజీ మేయర్ దండు నీతుకిరణ్, మాజీ కార్పొరేటర్లు విశాలిని రెడ్డి, సిర్ప సువర్ణ, మంజుల యాదవ్, చింతకాయల అలేఖ్య, గంగ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.



## గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

(నిజామాబాద్ ప్రతినిధి, ఇదీ సంగతి)

గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో ఆనందోత్సాహాల నడుమ ఘనంగా జరుపుకోవాలని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, అదనపు కలెక్టర్ భుజంగరావు సూచించారు. వినాయక చతుర్థి ఉత్సవాలను పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో మంగళవారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, అదనపు కలెక్టర్ భుజంగరావు సంబంధిత అధికారులకు కీలక సూచనలు చేశారు. గణేష్ ఉత్సవాలు, జెండా బాలాజీ జాతర సందర్భంగా చేపట్టాల్సిన చర్యలు, అందుబాటులోకి తేవాల్సిన సదుపాయాల గురించి సార్వజనిక్ గణేష్ మండలి ప్రతినిధులు, శాంతి కమిటీ సభ్యులు, ముస్లిం మత పెద్దలు, మండపాల నిర్వాహకులు పలు ప్రతిపాదనలు చేస్తూ తమ అభిప్రాయాలను వెల్లడించారు. శాంతియుత వాతావరణంలో, భక్తి శ్రద్ధలతో మతసామరస్యానికి ప్రతీకగా వేడుకలు జరిగేలా కృషి చేస్తామని అన్నారు. సీ.పీ సాయి చైతన్య, అదనపు కలెక్టర్ భుజంగరావులు మాట్లాడుతూ, ఉత్సవాల నిర్వహణకు అధికార యంత్రాంగం తరపున పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడ కూడా అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండపాల ఏర్పాటులో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మంటపాల వివరాలను ట్రాన్స్ కో అధికారులకు తెలియజేసి, ఆ శాఖ సిబ్బంది ద్వారానే విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేసుకోవాలని హితవు పలికారు. 8 అడుగుల కంటే తక్కువ ఎత్తు కలిగిన విగ్రహాలను మాత్రమే బాసర గోదావరిలో నిమజ్జనానికి



అనుమతిస్తామని, అంతకంటే ఎక్కువ ఎత్తు ఉన్న విగ్రహాలను ఉమ్మెడ వద్ద నిమజ్జనం చేయాలని సూచించారు. భారీ శబ్దాల వల్ల చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉన్నందున మంటపాల వద్ద డీ.జే సౌండ్లను నిషేధించడం జరిగిందని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య స్పష్టం చేశారు. ఇతరులను కించపరిచేలా, అసభ్యకరంగా వ్యవహరిస్తే కేసులు నమోదు చేస్తామని అన్నారు. కాగా, వినాయక నిమజ్జనోత్సవం సందర్భంగా ప్రమాదాలు జరుగకుండా ఉండేందుకు విగ్రహాలు నిమజ్జనం చేసే ప్రక్రియను ఆద్యంతం అధికారులు పర్యవేక్షణ జరపాలని, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుతూ క్రేన్, లైటింగ్ వ్యవస్థ, అత్యవసర వైద్యం, అంబులెన్స్, తాగునీరు, బారికేడింగ్, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, పారిశుధ్యం వంటి చర్యలు ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను అదనపు కలెక్టర్ భుజంగరావు ఆదేశించారు. గణేష్ ఉత్సవాలు, జెండా బాలాజీ వేడుకల సందర్భంగా నిర్ణీత రోజుల్లో మద్యం విక్రయాలు జరుగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారులకు సూచించారు.

## తాతా మధు రాజీనామా చేయాలి.. కేసీఆర్ క్షమాపణ చెప్పాలి

(నిజామాబాద్, ఇదీ సంగతి)

అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని కార్పొరేషన్ డీసీసీ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ అన్నారు. తాతా మధు వెంటనే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని, మాజీ సీఎం కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.స్పీకర్‌పై ఉద్దేశపూర్వకంగా అనుచిత వ్యాఖ్యలు




చేసిన తాతా మధుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరారు. తాతా మధు వ్యాఖ్యల వెనుక మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుల ప్రోత్సాహం ఉందని ఆరోపించారు. ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌లో జరిగిన బీఆర్ఎస్ఎల్పీ సమావేశంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను రెచ్చగొట్టి అసెంబ్లీకి పంపించారని విమర్శించారు.స్పీకర్‌ను అవమానించిన తాతా మధును ఎమ్మెల్సీ పదవి నుంచి శాశ్వతంగా అనర్హుడిగా ప్రకటించాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. కేసీఆర్‌పై కూడా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కేశ మహేష్, ఈఆర్ఓ కోఆర్డినేటర్ అబ్దుల్ వహీద్, టౌన్ డీసీసీ ఉపాధ్యక్షుడు సలీం, కార్పొరేటర్ ప్రవీణ్‌గౌడ్, గంగాధర్, కోఆప్షన్ సభ్యుడు బొబ్బిలి మురళీ తదితరులు పాల్గొన్నారు.

జనం కోసం.. అక్షర సమరం

# ఇదీ సంగతి

సంపుటి: 5 - సంచిక: 12 | 8 సెప్టెంబర్ 2026 | మంగళవారం | 4 పేజీలు




## మహేష్ గౌడ్

# అడుగులు ఎటువైపో..?




**టీపీసీసీ అధ్యక్షుడిగా రెండేళ్ల పదవీ కాలం పూర్తి చేసిన మహేష్‌కుమార్ గౌడ్ తదుపరి అడుగులు ఎటు వైపు వేయబోతున్నారనేది ఆసక్తిగా మారింది. రెండో దఫా పీసీసీ చీఫ్‌గా అధిష్టానం కొనసాగిస్తుందా లేదా మంత్రిగా అవకాశం ఇస్తుందా? అనేది ఇంకా స్పష్టత రావడం లేదు. పీసీసీ చీఫ్‌గా రెండో దఫా కొనసాగించాలని మహేష్ ఇప్పటికే అధిష్టాన పెద్దలను కోరినట్లుగా సమాచారం. మంత్రి కంటే పెద్దదని తాను ఇదే పోస్టు వైపే మొగ్గు చూపుతానంటూ మహేష్ సన్నిహిత వర్గాల వద్ద చెప్తున్నారు కూడా!**

గతంలో జిల్లాకు చెందిన డీఎస్ రెండు పర్యాయాలు రెండేళ్లు పైగానే పీసీసీ చీఫ్‌గా పనిచేసారు. కానీ ఒక్కసారి కూడా రెండేళ్లకు మించి కోన సాగలేదు. కానీ మహేష్‌కు పార్టీ అధిష్టానంలో మంచి పట్టు ఉంది. కీలక నేతలకు సన్నిహితుడిగా ఉంటూ వస్తున్నారు. మరో వైపు వచ్చే ఎన్నికల్లో వైయస్, డీఎస్ తరహాలోనే తాము కాంగ్రెస్‌ను రెండోసారి అధికారంలోకి తెస్తామని సీఎం రేవంత్ రెడ్డి పదే పదే చెప్తూ వస్తున్నారు. కానీ సీఎం రేవంత్ రెడ్డి, మహేష్‌ల మధ్య విభేధాలు నేపథ్యంలో పీసీసీ చీఫ్‌గా మహేష్ పొడిగింపును రేవంత్ అడ్డుకునే ఛాన్స్ ఉందని పార్టీవర్గాల్లో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. అందుకే అధిష్టానం మహేష్‌ను క్యాబినెట్‌లోకి వెళ్లాలని ఒత్తిడి చేస్తోంది. ఎలాగో మూడు స్థానాలు ఖాళీగా ఉన్నాయి అందులోనూ బీసీ సామాజికవర్గంకు చెందిన కొండా సురేఖను తొలగించినందున ఆమె స్థానంలో అదే సామాజికవర్గంకు చెందిన మహేష్‌ను క్యాబినెట్‌లోకి తీసుకోవాలనేది అధిష్టానం ఆలోచనగా ఉంది. ఎలాగో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేకుండా పోయింది. అందుకే ఆ కొరత కూడా తీరుతుంది. ఎమ్మెల్సీగా ఉన్న మహేష్‌ను మంత్రిగా తీసుకోవడంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవు. అసెంబ్లీ సమావేశాల తరవాత మంత్రివర్గ విస్తరణకు అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని చెపుతున్నారు. విస్తరణ ప్రక్రియ తర్వాతే పీసీసీ చీఫ్ విషయంలో స్పష్టత వచ్చేలా ఉంది. (జగదీష్ టేక్మాల్, ఇదీ సంగతి)

## బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డి అరెస్టు

(హైదరాబాద్, ఇదీ సంగతి)

స్పీకర్ మీద అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణల పై ఇద్దరు బిఆర్ యస్ ఎమ్మెల్సీ లను పోలీసులు మంగళవారం తెల్లవారుజామున అరెస్ట్ చేశారు. అసెంబ్లీ సమావేశాల తొలిరోజు 'కాంగ్రెస్ 1000 రోజుల వైఫల్య పాలన'ను నిరసిస్తూ బీఆర్ఎస్ సభ్యులు నల్ల టీ-షర్టులతో సభకు హాజరయ్యే క్రమంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ సందర్భంగా శాసనసభాపతి స్థానాన్ని ఉద్దేశించి ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలు శాసనసభ లోపలా, బయటా తీవ్ర దుమారాన్ని రేపాయి. దీంతో తాతా మధుపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు అయ్యాయి. తెల్లవారుజామునే రంగంలోకి దిగిన పోలీసు



బలగాలు హైదరాబాద్‌లోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌కు చేరుకుని తాతా మధును అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశాయి. అలాగే ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డిని సైతం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలు, నేతలు ఎమ్మెల్యే క్వార్టర్స్‌తో పాటు అగ్రనేతల నివాసాలకు తరలివస్తున్నారు.

## బోరు నీటితో విద్యార్థుల అనారోగ్యం..

- పాఠశాలల్లో ఫిల్టర్ నీరు అందించాలి
- కలెక్టర్‌కు టీజీవీపీ వినతి

(నిజామాబాద్, ఇదీ సంగతి)



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు శుద్ధి చేసిన తాగునీటి సౌకర్యం కల్పించాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ (టీజీవీపీ) డిమాండ్ చేసింది. ఈ మేరకు టీజీవీపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి కళ్యాణ్ ఆధ్వర్యంలో ప్రతినిధులు సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా కళ్యాణ్ మాట్లాడుతూ.. జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో, ముఖ్యంగా శంకర్‌భవన్ పాఠశాలలో, శుద్ధి చేసిన తాగునీటి సౌకర్యం లేక విద్యార్థులు నేరుగా బోరు నీటినే తాగుతున్నారని తెలిపారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్.. విద్యార్థులకు ఫిల్టర్ నీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారని కళ్యాణ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వినయ్, సాయి నైతిక తదితరులు పాల్గొన్నారు.

జనం కోసం.. అక్షర సమరం

# ఇదీ సంగతి

8 సెప్టెంబర్ 2026 | మంగళవారం | హైదరాబాద్ | 4 పేజీలు

## సైబర్ నేరగాళ్లపై పోలీసుల కొరడా

- 47 మంది అరెస్టు.. రూ.99.79 లక్షలు రీఫండ్
- ఏడు రాష్ట్రాల్లో 36 కేసుల ఛేదన.. ముగ్గురు నిందితుల పేర్లు వెల్లడి

(సయ్యద్ మొబిన్, ఇదీ సంగతి)

సైబర్ నేరగాళ్లపై హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు కొరడా ఝుళిపించారు. ఆగస్టు నెలలో దేశవ్యాప్తంగా ఏడు రాష్ట్రాల్లో ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహించి 36 సైబర్ నేరాల కేసుల్లో 47 మంది నిందితులను అరెస్టు చేశారు. బాధితులు కోల్పోయిన రూ.99,79,057 మొత్తాన్ని రీఫండ్ చేయించారు. ఎన్‌సీఆర్‌పీ ద్వారా అందిన ఫిర్యాదుల్లో 65 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అరెస్టయిన వారిలో తెలంగాణకు చెందిన 15 మంది, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 14, ఢిల్లీకి చెందిన 8, మహారాష్ట్ర, కర్ణాటకకు చెందిన నలుగురేసి, హరియాణా, ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఒక్కొక్కరు ఉన్నారు. పెట్టుబడి మోసాల్లో 16 మంది, ట్రేడింగ్ మోసాల్లో 12 మంది, సోషల్ మీడియా మోసాల్లో ఏడుగురు, ఓటీపీ మోసాల్లో ముగ్గురు, ఇంపర్సనేషన్ మోసాల్లో ముగ్గురు, ఉద్యోగ మోసాల్లో ఇద్దరు, క్రెడిట్ కార్డు మోసాల్లో ఇద్దరు, ఏపీకే, అడ్వర్టైజ్‌మెంట్ మోసాల్లో ఒక్కొక్కరిని అరెస్టు చేశారు.

**పోయిన ఫోన్‌తో రూ.25.50 లక్షలు స్వాహా :** అబిడ్స్ బస్‌స్టాండ్ నుంచి బస్సులో ప్రయాణిస్తున్న గోడిశాల కిష్టయ్యకు చెందిన మొబైల్ ఫోన్ ఫిబ్రవరి 28న పోయింది. అనంతరం ఆయన బ్యాంకు ఖాతా నుంచి తనకు తెలియకుండానే యూపీఐ లావాదేవీల ద్వారా రూ.25,50,750 బదిలీ అయినట్లు గుర్తించారు. దీనిపై సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో లిమోసిన్ షేక్ (29), బింగిన్‌పల్లి వెంకట కృష్ణ (23), ఇతాడి సంతోష్ (22)లిలను అరెస్టు చేశారు. వీరి నుంచి నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు క్రైం నంబర్ 279/2026గా నమోదు కాగా, ఐటీ యాక్ట్‌లోని 66సీ, 66డీ, బీఎన్ఎస్‌లోని 318(4), 319(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

***రూ.17.77 కోట్ల నష్టం:*** ఆగస్టులో 34 కేసుల్లో బాధితులు రూ.17,77,59,200 కోల్పోయారు. ఇందులో రూ.99,79,057ను రీఫండ్ చేయించారు. ట్రేడింగ్ మోసాల్లో రూ.17.05 కోట్లకుపైగా నష్టం జరగగా రూ.57.96 లక్షలు, ఏపీకే మోసాల్లో రూ.12.42 లక్షలు, బిజినెస్ మోసాల్లో రూ.7.18 లక్షలు, వాట్సాప్ డీపీ మోసంలో రూ.15.50 లక్షలు తిరిగి ఇప్పించారు. ఆన్‌లైన్ గేమింగ్, అక్రమ బెట్టింగ్, నకిలీ పెట్టుబడి వెబ్‌సైట్లను ప్రచారం చేస్తున్న 1,317 సోషల్ మీడియా ప్రొఫైళ్లు, 2,573 పెయిడ్ ప్రకటనలను పోలీసులు గుర్తించి తొలగించారు. వీటికి సంబంధించి తొమ్మిది ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో అనుమానాస్పదంగా ఉన్న మరో 231 ప్రొఫైళ్లను గుర్తించి తొలగించేలా చర్యలు చేపట్టారు. జోనల్ సైబర్ సెల్స్‌కు 2,952 ఎన్‌సీఆర్‌పీ ఫిర్యాదులు అందగా 349 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. 16 కేసుల్లో 20 మందిని అరెస్టు చేసి రూ.41,05,886 బాధితులకు రీఫండ్ చేశారు. సి-మిత్ర ద్వారా బాధితులకు అవగాహన కల్పిస్తూ 2,043 కాల్స్ చేయగా, 290 జీరో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. సీబీఐ, ఆర్‌బీఐ, ఈడీ, కస్టమ్స్, కోర్టులు, సైబర్ క్రైమ్ పోలీసుల పేరుతో బెదిరింపు వీడియో కాల్స్ వస్తే నమ్మవద్దని పోలీసులు సూచించారు. చట్టంలో 'డిజిటల్ అరెస్ట్' అనే విధానం లేదని స్పష్టం చేశారు. నకిలీ పెట్టుబడి గ్రూపులు, ఏపీకే ఫైళ్లు, ఫిషింగ్ లింకులు, వాట్సాప్ డీపీ, హనీట్రాప్, మ్యాట్రిమోనియల్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి, cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలని అదనపు పోలీస్ కమిషనర్ క్రైమ్స్ అండ్ సిట్ హైదరాబాద్ సిటీ సూచించారు.



## ఎర్రవెల్లిలో.. హై టెన్షన్..!

(సయ్యద్ మొబిన్, ఇదీ సంగతి)

సిద్దిపేట జిల్లాఎర్రవల్లి లోని కెసిఆర్ ఫామ్ హౌస్ వద్ద మంగళవారం హై టెన్షన్ తలెత్తింది. బిఆర్ యస్ కాంగ్రెస్ శ్రేణులు హోరాహోరీగా తెలపడ్డాయి.పలు చోట్ల పరస్పర దాడులకు తెగబడ్డారు.స్పీకర్ ను ఉద్దేశించి ఎమ్మెల్సీ తాత మధు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా వేయ్యి డప్పులతో ముట్టడిస్తామని కాంగ్రెస్ యస్సి సెల్ పిలుపు నిచ్చింది. ఇందులో భాగంగా సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు అంక్షారెడ్డి రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు డప్పుల చప్పుళ్లతో కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం కు మంగళవారం ముట్టడికి బయలుదేరారు.

ముందస్తు సమాచారం మేరకు భారీగా మోహరించిన పోలీసులు కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం వైపు వెళ్లే మార్గాలను మూసేసారు కానీ అనేక ప్రాంతాల్లో పోలీసులను తోసేసి కాంగ్రెస్ శ్రేణిలు వెళ్లాయి విషయం తెల్సి బిఆర్ యస్ శ్రేణులు సైతం ఎర్రవెల్లి వైపు పరుగులు తీశారు సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం మర్కుక్ మండలం వరదరాజపూర్ గ్రామంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. కాంగ్రెస్ శ్రేణులు, పోలీసుల మధ్య తోపులాట, వాగ్వాదం చోటుచేసుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.పలు వాహనాల మీద బిఆర్ యస్ శ్రేణులు రాళ్ల విసిరారు. ఎర్రవెల్లి లో హై టెన్షన్ నెలకొన్న నేపథ్యంలో అసెంబ్లీ లో ఉన్న బి ఆర్ యస్ ఎమ్మెల్యే లు కేటీఆర్ హరీష్ రావు తదితరులు వేరువేరుగా వాహనాల్లో ఎర్రవెల్లి వైపు వెళ్లారు వారంతా ఎర్రవెల్లి కి వెళ్తే పరిస్థితి మరింత జటిలంగా మారే ప్రమాదం వుండడంతో పోలీసులు అప్రమత్తం అయ్యారు వారందరిని హైదరాబాద్ లో ముందస్తుగా అదుపులోకి తీసుకోని బోయిన్ పల్లి స్టేషన్‌కు తరలించారు.

- బీఆర్ఎస్ కాంగ్రెస్ ల మధ్య హోరాహోరీ
- స్పీకర్ మీద ఎమ్మెల్సీ వ్యాఖ్యలకు నిరసనగా ఎర్రవెల్లి కెసిఆర్ ఫామ్ హౌస్ ముట్టడి
- భారీగా పోలీసు బలగాలు మోహరింపు
- ఎర్రవల్లి వైపు వెళ్లకుండా కట్టడి
- అసెంబ్లీ నుంచి నేరుగా ఎర్రవెల్లి వెళ్తున్న కేటీఆర్ హరీష్ రావు లను అడ్డుకున్న పోలీసులు
- భారీగా తరలి వెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు
- రేవంత్, కేసీఆర్‌ల దిష్టి బొమ్మల దహనం

## వికారాబాద్ రెండు మృతదేహాలు

(హైదరాబాద్, ఇదీ సంగతి)



వికారాబాద్ జిల్లాలోని తాండూర్ శివారు లో రెండు మృతదేహాలు కలకలం రేపాయి తాండూర్ మండలం ఐనెల్లి అటవీ శివారు లో పూర్తిగా కుళ్ళి పోయిన రెండు శవాల గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన వెళ్లిన పోలీసులు మృతదేహాలను వైద్య పరీక్షల కోసం పంపారు మహిళా పురుషులుగా గుర్తించారు. ఆత్మహత్య లు పాల్పడ్డారా లేదా హత్య కు గురయ్యారనేది మిస్టరీగా ఉంది మృతులను గుర్తించిన తరవాతే కేసు దర్యాప్తు కొలిక్కి వచ్చే ఛాన్స్ ఉంది.

## ఎమ్మెల్సీల రిమాండ్‌ను తిరస్కరించిన కోర్



(హైదరాబాద్, ఇదీ సంగతి)

స్పీకర్ అనుచిత వ్యాఖ్యల కేసులో ఇద్దరు ఎమ్మెల్సీ లకు కోర్టు రిలీఫ్ ఇచ్చింది. తాత మధు, నవీన్‌రెడ్డిలను మంగళవారం తెల్లవారు జామున అరెస్టు చేసిన పోలీసులు సాయంత్రం నాంపల్లి కోర్టులో హాజరు పరచారు. వారి రిమాండ్‌ను కోర్టు తిరస్కరించింది పదివేల పూచికత్తు తీసుకోని విడుదల చెయ్యాలని పోలీసులను ఆదేశించింది.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై దాడులు హేయమైన చర్య

(నిజామాబాద్ ఇదీసంగతి)



బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై పోలీసులతో భౌతిక దాడులు చేయించడం హేయమైన చర్య అని అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల మండిపడ్డారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించిన తీరును నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం నిజామాబాద్ ఐడీవోసీ ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. బీఆర్ఎస్ నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గణేష్ బిగాల మాట్లాడుతూ..ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును కాంగ్రెస్ ప్రభుత్వం కాలరాస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారెంటీల అమలును కోరుతూ నల్ల టీషర్టులు ధరించి శాంతియుతంగా అసెంబ్లీకి వెళ్తున్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై దౌర్జన్యం చేయడం దుర్మార్గమన్నారు. నర్సాపూర్ మహిళా ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి చీర పట్టుకుని లాగడం కాంగ్రెస్ ప్రభుత్వ అహంకారానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డితో పాటు పలువురు ఎమ్మెల్యేలను కిందపడేసి, తొక్కి గాయపరిచారని ఆరోపించారు.మహిళా ప్రజాప్రతినిధిపై, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై జరిగిన దాడులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన 420 హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. పాలన చేతకాకపోతే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి గద్దె దిగాలని డిమాండ్ చేశారు.ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, నిరంకుశ పాలన కొనసాగిస్తే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు.



# హామీలు నెరవేర్చాలని మాజీ ఎమ్మెల్యే అంబేద్కర్ విగ్రహానికి వినతి

(నిజామాబాద్ ఇదీసంగతి)



ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల నేతృత్వంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పూలాంగ్ చౌరస్తాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గణేష్ బిగాల మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలకు వెయ్యి రోజులు పూర్తయినా ఇప్పటికీ అమలు చేయలేదని విమర్శించారు. హామీల అమలుపై ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతోనే అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశామని తెలిపారు. 'అయ్యా.. మీరైనా ఈ ప్రభుత్వానికి కళ్లు తెరిపించి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేలా చూడండి' అంటూ అంబేద్కర్‌ను వేడుకున్నామని పేర్కొన్నారు.కార్యక్రమంలో మాజీ మేయర్ దండు నీతుకిరణ్ శేఖర్, నగర అధ్యక్షుడు సిర్ప రాజు, మాజీ నుడా చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, సుజిత్‌సింగ్, నవీద్ ఇక్బాల్, అబ్దుల్ మతీన్, జగత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ దుశ్శసనపర్వంతో మహిళలోకానికి దుర్దినం

(నిజామాబాద్ ఇదీసంగతి)



తెలంగాణ రాష్ట్ర శాసన సభ ప్రాంగణం సాక్షిగా మహిళలోకానికి తీరని అవమానం జరిగిందని నిజామాబాద్ జిల్లా భారత రాష్ట్ర సమితి లీగల్ సెల్ కన్వీనర్ దాదన్నగారి మధుసుదన్ రావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులు, మాజీమంత్రులు, ప్రస్తుత శాసన సభ్యుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం దుశ్శసన రీతిలో వ్యవహరించడం సభ్య సమాజానికి కలంకం తెచ్చిపెట్టిందని పేర్కొన్నారు. ప్రజలేన్నుకున్న ప్రజా ప్రతినిధుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును ఆయన ఖండించారు. ముఖ్యంగా మహిళ శాసన సభ్యుల పట్ల మ్యాన్ హ్యాండిల్ చేయడం గోరతప్పిద్దామని అన్నారు.నల్ల దుస్తులతో వెల్లి నిరసన తెలపడం చట్ట సమ్మతమేనని అది తెలంగాణ మలిదశ ఉద్యమం నేర్పిన పాఠమని అన్నారు.తెలంగాణ ఉద్యమం చేయని వాళ్లు ప్రభుత్వాన్ని నడిపిస్తే నిరసనను కూడా చూసి భయపడతారని నేటి సంఘటనను చుస్తే అర్థం అవుతోందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు కట్టుతప్పివ్యవహరించి ప్రజాస్వామ్యం అబాసుపాలు కావడానికి కారకులయ్యారని ఆరోపంచారు.భారాస శాసనసభ్యులపై భౌతిక దాడులకు పాల్పడిన పోలీసులపై, వారికి సహకరించి, ప్రోత్సహించిన కాంగ్రెస్ నేతలపై చట్టపరమైన చర్యలకు మధుసుధన్ రావు డిమాండ్ చేశారు.

# ప్రజావాణికి 116 ఫిర్యాదులు









(నిజామాబాద్ ఇదీసంగతి)

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 116 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ భుజంగరావు తో పాటు ట్రైనీ కలెక్టర్ సురేష్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, డీపీఓ శ్రీనివాస్ రావులకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కేసీఆర్ హత్యకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర







**(ఆర్మూర్, ఇదీ సంగతి)**

తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హత్యకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తున్న భావన ప్రజల్లో వ్యక్తమవుతోందని బీ ఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఆవరణలో వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన తొలి రోజు ఎలాంటి కారణం లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం జరిపించిన దాడుల ఘటనలు పలు అనుమానాలు రేకెత్తిస్తున్నాయన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై దాడుల కు నిరసనగా ఆర్మూర్ నియోజక వర్గం దొంకేశ్వర్ మండల కేంద్రంలో రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మ దగ్ధం చేసి పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. ఈ ఆందోళన కార్య క్రమాలకు నేతృత్వం వహించిన ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వమే నేరపూరిత రాజకీయాలకు కేంద్ర బిందువు కావడం ప్రజాస్వామ్యానికి దుర్దిన మని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి ఉంటే ఆయనే లక్ష్యంగా దాడి జరిగేదని ఆయన అన్నారు. రేవంత్ రెడ్డి ఒక రాజకీయ ఉగ్రవాది అని, ఆయన క్రిమినల్ బుద్ధి తెలిసుకాబట్టే బీ ఆర్ఎస్ నేతలు అప్రమత్తంగా ఉంటున్నారని ఆయన వ్యాఖ్యానించారు. కేటీఆర్, హరీష్ రావులు లక్ష్యంగా ప్రభుత్వం జరిపించిన దాడులు దీనికి సంకేతమని ఆయన నిలదీశారు. సభలో ప్రశ్నించకుండా బీఆర్ఎస్ ను రేవంత్ సర్కార్ బెదిరిస్తోందని జీవన్ రెడ్డి ఆరోపించారు. ఉద్యమ సమయంలో ఇలాంటి ఘటనలను తిప్పికొట్టిన చరిత్ర బీ ఆర్ఎస్ దని ఆయన గుర్తు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ కామెడీ చర్యలను ఎదుర్కోవడం గులాబీ సైన్యానికి ఒక లెక్కా అని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల చీరలు లాగి పరాభవిస్తారా? అని జీవన్ రెడ్డి మండిపడ్డారు. ఇది గౌరవసభ కాదు కౌరవసభ, ఈ రోజు బ్లాక్ డే అని ఆయన అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పి ఛైర్మన్ విఠల్ రావు,సీనియర్ నాయకులు రాజారాం యాదవ్,బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గూపన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి

**(నిజామాబాద్, ఇదీ సంగతి)**

నిజామాబాద్ నగరంలోని గూపన్పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న మౌలిక వసతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ సురేష్‌కు పీడీఎస్‌యూ వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ నగర అధ్యక్షులు ఎం.డి. నసీర్, నగర ప్రధాన కార్యదర్శి ఆర్. వినోద్ కుమార్ మాట్లాడుతూ, పాఠశాలలో సుమారు 130 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నప్పటికీ వారికి సరిపడా కనీస మౌలిక వసతులు లేవని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, బాలికలు మరింత ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కేవలం రెండు మూత్రశాలలు మాత్రమే ఉండటం సిగ్గుచేటన్నారు. పాఠశాలలో తాగునీరు, విద్యుత్, ఫర్నిచర్, తరగతి గదులు, పరిశుభ్రత తదితర సౌకర్యాలను మెరుగుపరచడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం, అందరికీ యూనిఫాం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పాఠశాలకు అందుతున్న అమ్మఒడి, ఇతర ప్రభుత్వ నిధులను ఏ విధంగా వినియోగించారో అంశంపై సమగ్రంగా పరిశీలించి, అవసరమైన నిధులను పాఠశాల అభివృద్ధికి వినియోగించాలని డిమాండ్ చేశారు.




జిల్లా విద్యాశాఖ అధికారులు పాఠశాలను క్షేత్రస్థాయిలో సందర్శించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి, కాలపరిమితిలో అన్ని సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు కనీస సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే విద్యార్థులు, తల్లిదండ్రులను కలుపుకొని ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాన్ని చేపడతామని ాణాఖ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూనగర సహాయ కార్యదర్శి ఆల్గోట్ సృజన్, నగర కోశాధికారి మణితేజ, తాదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 11న జరిగే ఛలో హైదరాబాద్ జయప్రదం చేయండి

**(నిజామాబాద్, ఇదీ సంగతి)**

తెలంగాణ రాష్ట్రంలోని కేజీబీవీ లో పనిచేస్తున్న నాన్ టీచింగ్, వర్కర్ల వేతనాల పెంపు ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 11న ఛలో హైదరాబాద్ ప్రచార కరపత్రాలను నిజామాబాద్ సౌత్, నార్త్ కేజీబీవీల్లో ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్లకు ఏళ్లుగా వేతనాలు పెరగలేదని, పైగా పని భారం పెరిగిందన్నారు. సమస్యలు పరిష్కరించమని విన్నవిస్తే, అదనంగా నైట్ డ్యూటీలు వేశారని ఆరోపించారు. కేజీబీవీ ల పట్ల జత ప్రభుత్వం కంటే కక్షపూరితంగా వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడేళు ్లగా అధికారులను ప్రభుత్వాన్ని ప్రజాప్రతినిధులను కలిసి విన్నవిస్తూనే ఉన్నామని, ఇక పోరాటం తప్ప



మరోమార్గం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ప్రకటించిన కనీస వేతనాలను తక్షణమే అమలు చేయాలన్నారు. అకౌంటెంట్, వర్కర్లకు నిబంధనలకు, జాబ్ చార్ట్ కు భిన్నంగా ఇటీవల కేటాయించిన నైట్ డ్యూటీలను రద్దు చేయాలన్నారు. వారానికి ఒకరోజు సెలవు చొప్పున వర్కర్లకు వీక్లీఆఫ్ అమలు చేయాలన్నారు. ఖాళీ పోస్టులు భర్తీచేసి పనిభారం తగ్గించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో అర్హతలు ఉన్న నాన్ టీచింగ్ సిబ్బందికి వెయిటేజీ ఇవ్వాలన్నారు. రిటైర్మెంట్ వయసును 65 సంవత్సరాలకు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. పీఎఫ్ ఈఎస్ఐ అమలు చేసి ఉద్యోగ, ఆరోగ్యభద్రత కల్పించాలన్నారు. ఈనెల 11న జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా అన్ని కేజీబీవీల నాన్ టీచింగ్, వర్కర్లు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ సిబ్బంది అఖిల, నగ్మా, రజిని, బాలమణి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవృత్తి హక్కుల సాధనకై న్యాయవాద పరిషత్ కృషి




**(నిజామాబాద్, ఇదీ సంగతి)**

న్యాయవాది పరిషత్ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు జిల్లా కోర్టు భవనంలోని బార్ అసోసియేషన్ హాల్లో న్యాయవాదులు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బండారు కృష్ణానంద్ మాట్లాడుతూ న్యాయవాదుల వృత్తిపరమైన రక్షణకే న్యాయవాది పరిషత్ కృషి చేస్తుందని, చట్ట పరమైన సంస్కరణలకు ఆలోచన సంక్షేమకై దేశవ్యాప్తంగా పనిచేస్తున్న ఏకైక సంస్థ న్యాయవాద పరిస్థితి పేర్కొన్నారు, న్యాయవాదుల అభ్యున్నతి కై న్యాయవాదులందరు పరిషత్తో కలిసి రావాలని కోరారు , ఈ సందర్భంగా న్యాయవాద పరిషత్ జిల్లా అధ్యక్షులు మల్లెపూల జగన్మోహన్ గౌడ్ మాట్లాడుతూ దేశంలో న్యాయవాద సమాజంలో అఖిల భారతీయ అదివత్త పరిషత్ గా ప్రారంభమై రాష్ట్రంలో తెలంగాణ న్యాయవాద పరిషత్ ఆవిర్భవించి భారతీయ సంస్కృతి నైతిక విలువ వృత్తి గౌరవం సమాజ శ్రేయస్సు జాతీయ వాద దృక్పధం తో న్యాయవాద పరిషత్ న్యాయ రంగంలో పనిచేస్తుందని న్యాయవాదుల సంక్షేమం కోసం సమాజాభివృద్ధి కోసం అందరూ ఐక్యంగా తమతో కలిసి పని చేయాలని ఆయన కోరారు కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎన్ సుభాష్ రెడ్డి న్యాయవాదులు ఎర్రం విఘ్నేష్ వసంత్ రావు మానిక్ రాజ్, ఆశ నారాయణ, బంటు వసంత్,సంతోష్ నాగ్,ఉదయ్ రోహన్ ,కార్తీక్, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

# జీవో నం.3ను వెంటనే సవరించాలి




**(నిజామాబాద్, ఇదీ సంగతి)**

15 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని జీవో నం.3ను వెంటనే సవరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి డిమాండ్ చేశారు. జీవో నం.3 విషయంలో ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని ఆరోపించారు. ఈ అంశంపై బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం చేపట్టారు. ఈ మేరకు నిజామాబాద్ జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో నేతలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. జీవో నం.3ను వెంటనే పెంచి, విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని కోరారు. 15 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశాన్ని ప్రభుత్వం తేలిగ్గా తీసుకోవద్దన్నారు. జీవో నం.3ను సవరించే వరకు బీజేపీ పోరాటం కొనసాగుతుందని దినేశ్ కులాచారి స్పష్టం చేశారు.

# కోర్ కమిటీ సభ్యుడిగా రేణిగుంట నాంపల్లి



**(నిజామాబాద్, ఇదీ సంగతి)**

కోర్ కమిటీ సభ్యుడిగా జిల్లాకు చెందిన ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు రేణిగుంట నాంపల్లి ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా ఎంఆర్పిఎస్ సీనియర్ నాయకులు నాంపల్లి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి కోర్ కమిటీలో తీసుకున్నందుకు మందకృష్ణ మాదిగకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను రెట్టింపు ఉత్సాహంతో చేస్తానని తెలిపారు